# హద్దు

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. రుక్మిణి సోఫాలో కూచుని ఊలు బనీను అల్లుతోంది. పక్కనే భర్త రాంబాబు కూచున్నాడు. ఆమె పువ్వుల శాలువ కప్పుకుని వున్నా, అతను మాత్రం రెండు చేతులూ కట్టుకుని కూచున్నాడు. అతనో పల్చటి షర్టు వేసుకున్నాడే తప్పించి, శాలువ లేదు. అతని వాలకం చూస్తుంటే చలితో వణికిపోతున్నట్టే వుంది.

నిజానికి రుక్మిణి అల్లుతున్న ఊలు బనీను, భర్త రాంబాబు కోసమే ! ఆ బనీను అల్లిక క్రితం సంవత్సరం చలికాలంలో ప్రారంభించింది. కొద్దిపాటి అల్లి, మూల పడేసి, మళ్ళీ ఇప్పుడు బైటకి తీసింది. ఉన్నది వున్నట్లు చెప్పుకోవాలంటే, రుక్మిణికి ఊలు బనీను అల్లడం సమంగా రాదు. మిడిమిడి పరిజ్ఞానంతో ప్రారంభించేసింది. ఎవర్నయినా అడిగి తెలుసుకుందుకు ఆమెకి చిన్నతనం. ఎవరి ముందయినా తలవంచడం ఆమెకి సరిపడని విషయం. అటువంటి మనస్తత్వం గాబట్టే. భర్త ముందు కూడా ఏనాడూ తల వంచదు.

రాంబాబు సౌమ్యుడు. మంచి మనసున్నవాడు. భార్య మనస్తత్వాన్ని అర్థం చేసుకుని, ఎలాగో సరిబుచ్చుకుంటున్నాడు.

".ఏమిటండీ రాంబాబుగారూ, అలా చలిలో వణికి పోకపోతే ఓ స్వెట్టరు కొనుక్కోకూడదండీ?" అని ఓ మిత్రుడోసారి సూటిగా ప్రశ్నించాడు.

రాంబాబు బాధగా ఓ నిట్టూర్పు విడిచాడు. " మా ఆవిడతో గొప్ప చావొచ్చి పడిందండీ. ఆవిడ అల్లుతున్న స్వెట్టరు పూర్తయితే అదే వేసుకోవాలిట. చలికి కాస్త తట్టుకునయినా అంతవరకూ ఆగమంటుంది. అంతే కాని, ఓ స్వెట్టరు కొనుక్కోనివ్వదు. ఒక విషయం చెప్పనా ? మా ఆవిడకి స్వెట్టరు అల్లడం సమంగా రాదు. వచ్చిన వాళ్ళ దగ్గర అడిగి తెలుసుకోదు. అలా తెలుసుకోవడం చిన్నతనమట. అందుకే కదండీ, గత సంవత్సరం ఈ సంవత్సరం కూడా చలితో బాధపడ్డాను" అన్నాడు.

మిత్రుడికి నవ్వొచ్చింది. అయినా నవ్వలేదు - రాంబాబు బాధపడతాడని ! అతని అవస్థకి జాలిపడ్డాడంతే.

రుక్మిణి అల్లుతున్నదే మళ్ళీ విప్పుతోంది.

రాంబాబు అది గమనించాడు.

"విప్పేస్తున్నావేవిఁటి రుక్కూ ?" అన్నాడు

"కాస్త తప్పొచ్చి ంది లెండి ! మళ్ళీ అల్లేస్తానుగా, దానిదేముందండీ" అంది రుక్మిణి.

"నీకు రాకపోతే ఎవర్నయినా అడక్కూడదటే ? " కాస్త ధైర్యం చేసి అన్నాడు రాంబాబు.

భర్తకేసి తీక్షణంగా చూసింది రుక్మిణి,

"నాకు రాకపోవడమేవిఁటండీ ! ఎంతటివాళ్ళకైనా తప్పులు రావడం సహజమే కదా ? ఈ రోజు అన్నారు. మరెప్పుడూ అనకండి" మందలించినట్టుగా కటువుగానే అంది.

"సరే ! మరెప్పుడూ అనను గాని, చలితో నేను ఛస్తున్నాను. అస్సామీజ్ దగ్గర చౌకగా దొరుకుతున్నాయి రుక్కూ ! వాళ్ళ దగ్గర ఓ స్వెట్టరు కొనుక్కుంటాను" ఉండబట్టలేక అన్నాడు రాంబాబు.

"మీకు డబ్బు విలువ తెలీదండి. ఎలాగూ ఊలుకొని, ఈ స్వెట్టరు అల్లుతున్నానా ? ఊలుకి డబ్బయిందంటారా ? మళ్ళీ ఇప్పుడు స్వెట్టరు తీసుకుంటే, ఆ డబ్బు వృధా అయినట్టే కదా ? అనవసరపు ఖర్చు లెందుకు చెప్పండి. ఏదీ మరో నెల రోజులు గామోసు చలికాలం ఉంటుంది. ఈ నెల రోజూలూ ఎలాగోలా ఓపిక పట్టి చలిని భరించండి. వచ్చే ఏడుకి నేనల్లుతున్న స్వెట్టరు రెడీ..' చిన్నగా నవ్వుతూ అంది రుక్మిణి.

రాంబాబుకి లోలోన ఏడుపొచ్చింది. అయినా ఏడవలేదు. ఓర్పుతో భరించాడు. కృత్రిమమైన ఓ చిరునవ్వు నవ్వేశాడు.

"సరే రుక్కూ" అంటూ అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయాడు రాంబాబు.

రుక్మిణి గర్వంగా ముసిముసిగా నవ్వుకుంది.

తన ఆధిక్యత నిలబెట్టుకుంటున్ననే గర్వం అది !

✪ ✪ ✪

ఓ రోజు ఆ వీధిలోకి కాయగూరలమ్మే లక్ష్మి వచ్చింది.

"అయ్యగారూ, నిగనిగలాడే లేత వంకాయలు తెచ్చానండీ చూస్తారా ?" అంటూ వరండాలో

పేపరు చదువుకుంటున్న రాంబాబుని అడిగింది.

" ఏదీ చూడనీ ! గంప దించు" అంటూ బైటికొచ్చాడు. న్యూస్ పేపరు మడతపెట్టి చేత్తో పట్టుకుంటూనే రాంబాబు.

లక్ష్మి కాయగూరల గంప దించింది. నిజమే ! లక్ష్మి చెప్పినట్లు నిగనిగలాడుతున్న చిన్న తెల్ల వంకాయలు ! వంకాయలంటే ఎంతో ఇష్టం రాంబాబుకి. ఆ వంకాయలు చూడగానే, గుత్తివంకాయ కూర వండించుకుని తినాలన్న అపూర్వమైన ఆకాంక్ష కలిగిందతనికి చెప్పొద్దూ, అతనికి నోరూరింది కూడాను.

" ఎలా అమ్ముతున్నావ్ ?"

" కేజీ పదిరూపాయలు బాబూ.. అసలు ఇట్టాంటి వొంకాయలు దొరకడంవే నేదు అయ్యగారూ"

"అంత ఖరీదా? అయిదు చేసుకో"

"మరో మాట సెప్పండి"

"ఆరు రూపాయలు చేసుకో కేజీ"

"గిట్టదు అయ్యగారూ.. ఎనిమిది చేసుకోండి"

"వద్దులే ! అంత ఖరీదు పెట్టి కొనడమేంటి ? బజార్నుంచి తెచ్చుకుంటాలే"

"అందరూ అట్టాగంటే మానాంటోళ్ళం బతికేదెట్టా బాబుగారూ ! సర్లెండి... ఆరు రూపాయలే చేసుకోండి. ఒక కిలో వంకాయలిమ్మంటారా యేటి అయ్యగారూ?"

"కిలో ఎందుగ్గానీ, ఓ అరకిలో ఇవ్వు... తూకం వేసి అక్కడ పెట్టు" అంటూనే - "రుక్మిణీ, ఇలా ఓ సారి వస్తావా?" అంటూ లోపలికి కేక వేశాడు రాంబాబు.

భర్త కేక విని లోపల్నించి వచ్చింది రుక్మిణి.

"ఏంకొంప మునిగిందని కేకేశారు?" హుందంగా అడిగింది రుక్మిణి వస్తూనే.

"ఈ వంకాయలు చూడు రుక్కూ, ఎంత బావున్నాయో? చిన్న వంకాయలు... నిగనిగలాడుతున్నయ్. గుత్తి వంకాయ కూర వండుకుంటే ఎంత రుచిగా వుంటాయో ! తలచుకుంటుంటేనే నోరూరుతోంది. అందుకే, అరకేజీ వంకాయలు తీసుకున్నాను. మూడు రూపాయలిచ్చేయ్ లక్ష్మికి" చెప్పుకుపోయాడు రాంబాబు.

గచ్చుమీదున్న వంకాయలు చూసింది నిజంగానే నిగనిగలాడుతున్నయ్. అయితే ఆమెకి ఆనందం

కలగలేదు. ఆమె ముఖం అరుణకాంతిని పులుముకుంది. భర్త స్వతంత్రంగా ఏ పనీ చెయ్యడం ఆమెకి నచ్చదు. ఒక విధంగా భర్త చర్య, ఆమె ఆధిక్యతని సవాలు చేస్తున్నట్టే అనిపించింది.

" అప్పుడే తూకం వేయించేశారా ?" ఆయనేదో తప్పుపని చేసినట్టుదానే గద్దించింది ఆమె కళ్ళు ఎర్రబారినయ్.

"ఔను రుక్కూ ! ఎలాగూ తీసుకుంటాం కదా!" అన్నాడు రాంబాబు, కాస్త ధైర్యంగానే

కూరగాయలమ్మే లక్ష్మీ కేసి తిరిగిందీసారి రుక్మిణి.

" ఏవే! లక్ష్మీ! ఆయనకి బుద్ధి లేకపోతే నీకైనా వుండక్కర్లా ? నేను చెప్పకుండా ఎందుకిచ్చావ్ వంకాయలు ?" లక్ష్మిని కసిరింది.

భర్తని తూలనాడితే అతనికి అది అలవాటుగా బట్టి సహించాడు గాని, పరాయి లక్ష్మి ఎందుకు భరిస్తుంది ? లక్ష్మి రుక్మిణికేసి సూటిగా చూసింది.

" ఏటండీ అమ్మగోరూ, నన్ను కేకలేత్తన్నారు ? ఆయన గోరు మీ ఇంటి యజమానికదా అని, సెబితే ఇచ్చినానండీ, నాకేం తెలుసండమ్మా గోరూ, ఆయన పేరుకే యజమానని ?" జంకూ, గొంకూ లేకుండానే ఎదురు చెప్పింది లక్ష్మి.

రాంబాబుకి అభిమానం దెబ్బతింది. మనస్సు చివుక్కుమంది. కూరగాయలమ్మే లక్ష్మి సమక్షంలో తన పరువు కాస్త గల్లంతవుతున్నందుకు లోలోన బాధపడ్డమే కాదు మండిపడ్డాడు కూడా తను ఆమె కిచ్చిన స్వేచ్ఛను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నందుకు కోపమొచ్చింది భార్యమీద.

"లక్ష్మిని అనడమెందుకు రుక్కూ? తీసుకున్నవాణ్ణి నేను ? గుత్తివంకాయ కూర వండించాలని తీసుకున్నాను ! తప్పా?" విసురుగానే అన్నాడు.

భర్తలో అటువంటి మార్పు రావడాన్ని సహించలేకపోయింది రుక్మిణి. అతనికేసి ఎర్రగా చూసింది.

"తప్పా?" తప్పన్నరా? మీకేమన్నా బుద్ధి వుందటండీ? గుత్తి వంకాయకూర వండడానికి, మంచినూనె చవుకగా దొరుకుతుందనుకుంటున్నారా? లేకపోతే గరమ్‌మసాలా సామాన్లు తేరగా వస్తున్నాయా ? కోరికల కయినా హద్దుండాలండీ !" అంది రుసరుసలాడుతూనే.

లక్ష్మి, రాంబాబు కేసి జాలిగా చూసింది. పాపం, ఆ మానవుడు ఎంతగా ముడుచుకుపోయాడో గమనించింది. అతని పరిస్థితిని అర్థం చేసుకోగలిగింది.

"అయ్యగోరూ! మీ మాటకి యిలువనేదని తెలిసి, నన్నెందుకు పిలిసినారండీ? పాపం, ఈ జనమలోతవరి కోరిక తీరేలా నేదండీ! ఏం చేత్తాం? మీనాంటోల్ల బతుకే అంత" అంటూనే గచ్చు

మీద వేసిన వంకాయల్ని విసుగ్గా బుట్టలో పడేసుకుని, బుట్టనితల మీద కెత్తుకుని నిష్క్రమించింది

లక్ష్మి మాటలు విన్న రాంబాబుకి తల కొట్టేసినంత పనయ్యింది. అతని అంతరంగంలో అంత వరకూ బుసలుకొటుతున్న అగ్నిపర్వతం బద్దలయ్యింది. ఆ లావా కోపం రూపంలో బైటపడింది భార్యకేసి తీక్షణంగా చూశాడు

"మరీ నన్నింత చవటని చెయ్యడం ఏమీ(బావుండటంలేదు రుక్కూ! ఇంట్లోపల నువ్వేమన్నా పెద్ద మనసుతో పట్టించుకోకుండా భరించేవాణ్ణి. కాని, ఇప్పుడా కూరగాయలమ్మే లక్ష్మి సమక్షంలో నన్నిలా అవమానించడాన్ని సహించలేకపోతున్నాను" అని రాంబాబు ఆవేశంతో ఇంకేదో అనబోతూ వుంటే, రుక్మిణి చప్పున అందుకుంది-

"ఏవిఁటీ? సహించలే పోతున్నారా? ఆఁ... అయితే, ఏంటటా? " అంటూ ఎప్పటిలానే నిర్భయంగా, హుందాగా అంది రుక్మిణి, భర్తలో వచ్చిన మార్పుని ఆమె గుర్తించలేకపోయింది. అంతే.

ఆమె చెంప ఛెళ్ళుమంది. ఆమెకి కళ్ళు బైర్లు కమ్మినట్టయ్యింది. భర్త చెంప దెబ్బ అంత ఘాటుగా వుంటుందని ఆమె ఊహించలేదు. ఇంతవరకూ అనుభవించలేదు కదా మరి!

రుక్మిణికి కోపం వచ్చింది. కళ్ళెర్రజేసింది.

"నన్ను కొడ్తారా? మీకు.... మీకు...." అంటూ అతని మీదికి రాబోయింది. రెండో చెంప పగిలింది.

ఇరుగు పొరుగువాళ్ళు, రోడ్డుమీద పోతున్న వాళ్ళు చూస్తుండగా జరిగిందీ సంఘటన.

రుక్మిణికి అహం దెబ్బతింది. అవమానంతో కృంగిపోయింది. పళ్ళు పటపట కొరుకుతూ భర్త కేసి చూస్తోంది రుక్మిణి, తీక్షణంగా. ఏదో అనాలనుకుంటోంది. కాని, ఆమెకి ఆ అవకాశాన్ని ఇవ్వలేదు రాంబాబు.

"ఇంకేం మాట్లాడావంటే నరికేస్తాను తెలుసా? నాకు స్వాభిమానం, పౌరుషం లేవనుకుంటున్నావా? సమైక్యంగా సర్దుకుపోవాలని ఏమీ( పట్టించుకోకుండా ప్రవర్తిస్తూ వుంటే, అది నా చేతగానితనంగా భావిస్తున్నావా? నాకు నచ్చాయని వంకాయలు కొంటే, అమ్మినదానిముందేనన్ను అవమానపర్చి, ఆ వంకాయలు తిరిగి ఇచ్చేసి, నీ ఆధిక్యత చూపుతావా? అర్ధాంగివి కదా అని, అరమరిక లేకుండా నా జీతం నీ చేతిలో పోస్తుంటే, నాకు ఆర్థిక స్వాతంత్ర్యం లేనట్టే, లక్ష్మి సమక్షంలో ప్రవర్తిస్తావా? లక్ష్మి నా గురించి ఎంత చులకనగా మాట్లాడిందో విన్నావా? అంతేనా? రెండేళ్ళనుంచీ నా కోసం స్వెట్టరు అల్లుతానంటూ ప్రారంభించి, చేతకాక, ఆ నిజాన్ని ఒప్పుకోక, షాపులో స్వెట్టరు

కొనుక్కుంటానంటే కొనుక్కోనివ్వకుండా, ఈ రెండేళ్ళూ నేను చచ్చినట్టు చలిని భరించినట్టు చేశావు. అక్కడా నీ ఆధిక్యతని చూపుకున్నావు. ఎవడిచ్చాడు నీకీ అధికారం? నా మంచితనం తో నీకిచ్చిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేసుకున్నావు. భర్తను గౌరవించడం నేర్చుకోముందు. ఈ రోజు నుంచీ ఇంటి ఖర్చులు నేనే చూసుకుంటాను. నేను చెప్పింది చెయ్యి. తెచ్చింది వండు. అంతే" ఆవేశంగా చెప్పుకుపోయాడు రాంబాబు.

రుక్మిణి నీరుగారిపోయింది. భర్తలో అంత త్వరగా ఇటువంటి మార్పు వస్తుందని, ఆమె కలలో కూడా ఊహించలేదు. ఆమెకి దుఃఖం ముంచుకొచ్చింది. ఏం చెయ్యడమో తోచలేదు.

" నేను మావాళ్ళింటికి వెళ్ళిపోతాను. ఇంక ఒక్కక్షణం వుండనిక్కడ" ఆఖరి ఆయుధాన్ని ప్రయోగించింది రుక్మిణి రుద్ధస్వరంతో.

రాంబాబు కరగలేదు.

"వెళ్ళు.. ఈ క్షణమే వెళ్ళు. ఎవ్వరూ ఆపరు నిన్ను. హాయిగా, హొటల్లో భోంచేస్తాను" అన్నాడు నిర్లక్ష్యంగా. అతనికి తెలుసు, రుక్మిణిని ఆదరించేవాళ్ళెవరూ లేరని ! అందుకే అంత నిర్లక్ష్యంగా అన్నాడు.

పాపం రుక్మిణి ఆఖరి ఆయుధమూ పనిచెయ్యలేదు. కంట తడిపెట్టుకుంటూ అక్కడే నిల్చుండిపోయింది. ఆమెలో పరవళ్ళు తొక్కిన ఆవేశం చప్పబడిపోయింది.

"పద లోపలికి..." హుంకరిస్తూ అన్నాడు రాంబాబు.

మరో మార్గం అగుపించలేదు రుక్మిణికి. ఎటువంటి ఎదిరింపూ లేకుండానే, పిల్లిలా లోపలికి నడిచింది.

ముసి ముసి నవ్వుకుంటూ, లోపలికి పోయి తలుపు వేసుకున్నాడు రాంబాబు. తనలో మార్పు తెచ్చిన లక్ష్మిని మనసులోనే అభినందించుకున్నాడు.

దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న లక్ష్మి, రాంబాబులోని ఈ మార్పుకి, అతణ్ణి మనసులోనే అభినందించుకుంది. ఇప్పుడతను నిజమైన ఇంటి యజమాన అని అనుకుంది. మర్నాడు నుంచి వంకాయలు తీసుకొని అతనింటికి తప్పకుండా వెళ్ళాలని అప్పుడే నిర్ణయించుకుందామె.

□□□

(స్వాతి వారపత్రిక - 25.6.93)